కథానిక



# కోట పిలుపు

మూలం: **కేశవదేవ్**

అనువాదం: **శ్రీ భాస్కర్**

"నా పిలుపు ఎవరు వింటారు? పిలుస్తూ పిలుస్తూండగానే శతాబ్దాలు గడచిపోయినై. అయినా అంతా అరణ్యరోదనంగానే ఉండిపోయింది. సంవత్సరాలతరబడి శృంఖలాల్లో ఉండి పతనానికి పరువులెత్తే సమాజం కూడా విముఖం కాలేదు. ఎంతోమంది వ్యక్తులు వచ్చారు. నావైపు చూశారు. వెళ్ళిపోయారు. అనేకులు నావిషయమై చర్చించారు. అంతే తరువాత శాంతించారు. నాపిలుపు విని వికలమైన హృదయంతో లేచివచ్చే మాతృదేవిగాని, స్వయం స్ఫూర్తితో ముందు కురికే ఒక్క వీరుడుగాని లభించలేదు. మాతృదేశంకోసం బలిఅయ్యే యీ సమాజసహజభావనను అతలతలంలో ఎవరు అణచిపెట్టారో?

పథికుడా నీవు నాభావుకహృదయాన్ని ప్రశ్నించావు. చాలును దానితోనే నా హృదయం నిండింది. హృదయంలో భావసముద్రం మథింపబడుతోంది. నేను జడపదార్థాన్ని. ఆక్రాంతులపైన ప్రతీకారం చేసేసామర్థ్యం లేదు నాలో. కాని యీమాత్రంలో నాకు స్వదేశాభిమానం లేదనికాని సమాజగతివిధానం పైన శ్రద్ధ లేదనికాని అర్థం కాదు. నేను జడత్వాన్ని అయినప్పటికీ నాకూ ఒక హృదయముంది. దానిలో ఒక మహావీరుని చిత్రం నేడుకూడా ఎలా ఉన్నదీ అలాగే అంకితమై ఉంది. అతడుకూడా నాపిలుపు విన్నాడు. పరుగెత్తుకుంటూ వచ్చాడు. క్షణం ఆలస్యం కూడా అతని అభీష్టం కాదు. పుత్రవివాహం ఆపుచేయబడింది. తెలుసుకో! నేనే అతని పుత్రుడిని. నాకోసరమే యిప్పుడావివాహం ఏర్పరపబడాలి. అతడిని స్మరించినంతటిలో గర్వించే నేను జర్జరితశరీరంతో నిలువునా మంచున్నాను. అతడు ఎదుటి పరిస్థితులకి జంకలేదు. తల్లి, భార్య, కొడుకు, పరివారం అన్నిటికంటె ముఖ్యంగా పుత్రవివాహపుణ్యముహూర్తం ఆ ఆత్మబలిదాతని ఆపలేకపోయినై. నేటికికూడా అతడిని స్మరించినంతటిలో నా అంగప్రత్యంగం గర్వంతో ఉప్పొంగుతోంది. నా కాయంలోని ప్రతి శిలాశకలం పులకరిస్తోంది.

వినదలచుకున్నట్టయితే మళ్ళా యీనాడు ఆ కథని వినిపిస్తాను. అందువలన నాకు ఆనందం కలుగుతుంది. మీరు యీ మహత్తరకార్యాన్ని మఱచిపోయారు. కాని నేను ఆసేతుశీతాచలపర్యంతం వ్యాపించి ఉన్న హిందూసమాజానికి శతాబ్దాలతరబడిని వినిపిస్తూనే ఉన్నాను, వినిపిస్తూనే ఉంటాను. ఈ ఉన్నతశిఖరంపయిన యెంతవఱకు నా శరీరశేషం ఉంటుందో అంతవఱకు ఆదర్శధర్మపాలకుడు ఆ నా తానాఅమరగాథని వినిపిస్తూనేఉంటాను. ఎంతవఱకూ వీరి కామహాపురుషుని స్మరణ రాదో కదా! ఇదే నా జపం. ఇదే నా ధ్యానం. నాకు ముక్తిని చేకూర్చడంకోసం, తన హృదయాన్ని చీల్చి, మూడు వందల అడుగులు పైకి ఎక్కుతూ, దినమంతా ఆకలితోను, దాహంతోను ఉన్న తానా చిత్రాన్ని హిందూరాష్ట్రంలోని నవయువకులకు ప్రదర్శించడమే నా జీవితచరమలక్ష్యం.

మాతృదేవి జీజాబాయి దూరంగా దుర్గంపై నుండి నావైపు దయాపూర్ణదృష్టితో చూచిన ఆ రోజు నాస్మృతి పటంపైన ప్రస్ఫుటంగా అంకితమైఉంది. నాగుండెలో దిగగొట్టబడిన కొఱ్ఱుపైన ఎగురుతూ ఉండే ఆకుపచ్చని యిస్లాంజండాను చూచింది. నాతో సమంగా తల్లికూడా ఆబాధ ననుభవించింది. ఈ విషయాన్ని నేను నా దూరదృష్టిద్వారా తిలకించగలిగాను. ఓడిపోయి, పల్చపాటైన నా ముఖాన్ని చూస్తే ఆ మెహృదయంలో ఎంతో బాధ కల్గింది. అప్పుడు నేను "జీజా, నామాతా! నన్ను రక్షించు. ఈ రాక్షసులనుంచి నన్ను విడిపించు" అని గట్టిగా అరిచాను. పుత్రుడిని సింహం నోటిలో విడిచిపెట్టడానికి కూడా సంకోచం లేని ఆ క్షత్రాణీహృదయభాండారంనుంచి రెండు అమూల్యరత్నాలు కన్నుకొలకుల్లోంచి వెలువడి నావైపు జారిపడినై

తల్లిపలుకులను విని శివుడు నావైపు చూశాడు. అతని స్నేహితుడు తానాకూడా నావైపు చూచాడు. మాతృభూమి జడనందనుల్లో ఒకని హృదయంలో శూలం నాటి శత్రువులు తమ విజయధ్వజాన్ని ఎగురవేస్తున్నారు. నేను గట్టిగా కేక వేస్తున్నాను. కాని యెవరూ వినడంలేదు. ప్రపంచాన్నంతటినీ తమ హుంకారంతో కంపింపజేసే శూరులూ, వీరులూ నావైపు వెను దిప్పి కూర్చున్నారు.. ఎటువంటి నపుంసకత! ఆ క్షత్రియహృదయం ఒక్కసారి రగుల్కొందంటే తుపాకీమందుపైన నిప్పు పోసినట్టే. కాని ఎందుకు ఉద్యమించడం లేదు? వాళ్లు రావణుని వధించిన రాముని వంశంలో పుట్టారు. కంసుని చంపిన కృష్ణుని వంశంలో ఉద్భవించారు. జరాసంధుని కాలుపట్టుకొని చీల్చి చంపిన భీముని వంశీయులు. వీళ్ల నాడుల్లోకూడా వాళ్ల రక్తమే ప్రవహిస్తుంది.

ఈ వేళ్టికికూడా జ్ఞాపకముంది. ఆ చీకటిరాత్రి – దక్షయజ్ఞవిధ్వంసనకి బయలుదేఱిన భగవంతుడు శంకరుని ప్రమథగణానికి నాయకత్వం వహించిన మహాభైరవుడులాగు తానా నిశ్శబ్దంగా నాక్రిందికి వచ్చి నిలబడ్డాడు. నా ప్రాంగణంలో విషపురుగు ఉదయభానుడు ఒక సతిపై జరిపిన అత్యాచారం అతని హృదయంలో ఈటెపోటులాగు నాటుకుంది. నన్ను స్వతంత్రను గావించేదాకా అన్నమూ, జలమూ ముట్టనని ప్రతిజ్ఞ తీసుకున్నాడు. కూడా గుప్పెడుమంది సైనికులు. కాని హిమాలయసదృశనిశ్చయంతో నన్ను విడిపించడానికి – పెద్ద మొగలు సామ్రాట్టుహరితకేతనాన్ని ధూళిధూసరితం గావించి – పరమపవిత్రభగవాధ్వజచ్ఛాయలని వ్యాపింపచేసి – ఆ పవిత్రమయిన నాయీ శరీరాన్ని పరిశుద్ధం గావించడం! – అబ్బ ఎంత దృఢనిశ్చయం ప్రకాశిస్తుందో అతని కన్నుల్లో!!

ఆరంభం చేస్తూచేస్తూనే ఆ వీరుడు నాపైకి వచ్చేశాడు. అతని వెనకాలనే నవ్వాగు నీడలాగు అనుసరించే అతని సైనికులు. నా గోడపైన చెయ్యి రాస్తూ అతను అన్నాడు, దుర్గమా! ఇక విచారించకు. శ్రీ శివాజీమహారాజువఱకు నీపిలుపు చేరింది. జీజామాతకృపాదృష్టి నీమీద పడింది. నీదుఃఖం దూరం గావించడంకోసం అతని రామబాణాన్ని నేను యిక్కడకు వచ్చాను" అని. అప్పుడు నా ప్రతీపాషాణమూ అతనికి త్రోవ నిచ్చింది. ఒక్కొక్కపాషాణం అతని కొక్కొక్క సోపాన మయింది. మఱి నేనో? నేను ఆత్మవిస్మృతితో "హిందూరాష్ట్రనిర్మాతా ముక్తిదాత అయిన శివాజి గొప్పవాడా అతని ఆజ్ఞలను హనుమంతునివలె వెంటనే పాలించే యీ మహావీరుడు గొప్పవాడా?" అని ఆలోచిస్తూన్నాను.

ఒక్కక్షణంలో నా ప్రాంగణంలో "త్రాహి త్రాహి" ధ్వనులు బయలువెడలినై "అరే! అల్లా! తోబా! తోబా!" "హరహరమహాదేవ్" నాదాలు మాటిమాటికి ప్రతిధ్వనింపసాగినై. అనేకమంది శత్రువులు ఆతొందఱలో నాశిఖా పుటంచులకు పరుగెత్తారు. రక్తదాహంతో ఉండే నాశిలలు హృదయం తెఱచి వాళ్ల తలల్లోని రక్తాన్ని త్రాగినై. శత్రువుల శిరస్సులపైన నాతానాఖడ్గం మెఱుపులాగ మెఱిసింది. వఱదల్లో కొట్టుకుపోతున్న నీటిలాగు హిందూవీరులు మూలమూలా వ్యాపించారు. తీవ్రంగా యుద్ధం సాగుతోంది. సింహంలాగు చూస్తూ దెబ్బలాడే తానా ఆ కటికచీకటిరాత్రిలో సాక్షాత్తూ యముడయ్యాడు. ఒక్క దెబ్బకూడా అతనిది వృథాపోలేదు. ఒక్క దెబ్బకూడా నిరర్థకం కాలేదు. నా ప్రతీ ఒక్క పాషాణంలోనూ ఉత్సాహం అధికమయింది. ఒకటి తరువాత ఒకటి – ఆ కఠోరరాయళ్ల తలలు భుజాలనుంచి వేరయి తాను చేసిన అత్యాచారాలకి ప్రతిఫలంగా నేలను ముల్లి క్షమాభిక్ష వేడుతూన్నట్లు ముక్కు నేలను రాస్తున్నయి. నాట్లపయిన తాండవంచేస్తూ ఆ మహాకాళి, తానా సింహద్వారాన్ని తెఱచాడు.

గట్టు తెగి పొంగి పాఱే నదీప్రవాహంలాగు సూర్యాజీ నేతృత్వంక్రింద యముడినిగూడా తొడకొట్టి సవాలుచేసే హిందూవీరులు ప్రవేశించారు. నేను కూడా నా ముక్తిదాయకునికోసం నా హృదయం తెరిచాను. ప్రతిక్షణం "అల్లాహూ అక్బర్" స్థానంలో "తోబాతోబా" "ఖుదాకీ పనాహ్" (పశ్చాత్తాపం దేవా! శరణుశరణు, అనే ధ్వనులు తీవ్రతరమౌతూన్నయి. "హరహర మహాదేవ్" విజయనాదం క్రమంగా ప్రబలతరం అవుతోంది. నా శిలలు కూడా గర్వంతో లేచినై. "హరహరమహాదేవ్!" హుంకారం నా కణకణంలోనూ ప్రతిధ్వనిస్తూ నూరురెట్లయింది.

స్వార్థంకోసం తన శౌర్యాన్ని అమ్ముకున్న ఉదయభానుడు తన కులాన్నీ, దేశాన్నీ, సమాజాన్నీ కళంకితంగావించిన ఉదయభానుడు తన విహారానికి అవరోధం రావడం మూలంగా క్రుద్ధుడై, మత్తఉన్మత్తమత్తేభంలాగు రణాంగణంలో ప్రవేశించాడు, కత్తీ డాలూ తీసికొని. పరుగెత్తుకుంటూ వచ్చిన పాదాలు ఆగిపోయినై. దెబ్బతిని వెనుదిరిగిన శత్రువులంతా అతని కేకతో వెనక్కి తిరిగారు. తొలగిపోయినవాళ్ల సాహసం మళ్లా చేరుకొంది. అతడు శీఘ్రంగా వ్యూహం రచించి యుద్ధానికి తలపడ్డాడు.

హిందూసైనికులు సంఖ్యలో చాల తక్కువ. దానితోపాటు రోజంతా కష్టపడి బాగా అలసిపోయారు. మొగలులు సంఖ్యలో అత్యధికంగా ఉన్నారు. వాళ్లదగ్గఱ ఆయుధసామగ్రి యెక్కువగా ఉంది. వ్యూహంలో నిలబడడంమూలంగా వాళ్లకి నష్టం తక్కువ. అత్యంతవేగంతో సాగిపోయే భాగీరథీప్రవాహం మార్గంలో విశాలశైలం అడ్డుకోవడంమూలంగా క్షణకాలం ఆగిపోయింది.

పారిపోతూన్న మొగలులు ఆగిపోయి, వ్యూహబద్ధులై విజయమాల ధరింపబోవడం తానా చూచాడు. అతను చూచాడు ఖిలాడిచిత్తుఅవుతూ కూడా ప్రక్కకి ఒత్తిగిల్లడం. ఎప్పుడూ ఓటమి నెఱుగని హిందూవీరులు కొంటుబడడంకూడా అతను చూచాడు. ఉదయభానుని ప్రతాపం చాలదూరంవఱకు ప్రసరించింది. రణరంగంలో అనేకమంది సైనికులు అతని పేరు విన్నంతటిలోనే శిథిలమైపోతున్నారు.

మఱుక్షణంలో సింహనాదంచేసి యీ వనరాజు ఆ గజరాజును మార్కొన్నాడు. ఇద్దఱి తీక్ష్ణదృష్టులు పరస్పరం కలుసుకున్నయి; ఒకరినొకరు పరిచయంచేసుకొన్నారు. మఱునిముషంలో తీక్ష్ణకృపాణధారలు చూపుల స్థానాన్ని ఆక్రమించినై. ఇద్దఱి శరీరాలు పొంగి పొడవయినై. ఇద్దరూ పంజా విసిరారు. ఇద్దరూ ప్రాణాలను పందెంగా ఒడ్డారు. ఒకని విజయమే యీనాటి విజయమౌను. ప్రాణం యిచ్చెయ్యడమా? పుచ్చుకోవడమా? అనేది ప్రశ్న. ఇరువురి కళ్లల్లోనూ రక్తం ప్రకాశిస్తుంది. ఇరువురి ముఖాల్లోనూ శోణితం రాగరంజిత మయింది. వస్త్రాలు రక్తంలో ముంచెత్తబడినై. ప్రబల వేగంతో శ్వాస వెలువడుతోంది. ఖడ్గాంచలాల నుంచీ భయంకరస్ఫులింగాలు ఉద్భవిస్తున్నయి. ఈ యిరువురి మహాయుద్ధాన్ని యిరుతెగలసైనికులు నివ్వెఱపాటుతో చూస్తున్నారు. రెండు పక్షాల సైనికులు తమ తమ నాయకులదే విజయమని నమ్ముతున్నారు.

ప్రబలవేగంతో ఉదయభానుడు వేసిన వ్రేటును అడ్డుకోవడంలో తానాడాలు తుత్తునియలైపోయింది. వజ్రపాతం!! ఆ కష్టసమయంలో మఱొక డాలు ఎక్కడినుంచి వస్తుంది? నా హృదయం తందరించింది – "ఇప్పుడేమవుతుంది? ఓయి భగవంతుడా! యిప్పుడేమవుతుంది?" డాలు ముల్లిపోవడంతోనే ఉదయభానుని ముఖంపైన పాశవికనృశంసత ప్రకాశించింది. తానా ఒక్క అడుగయినా వెనక్కి వేయలేదు. లవలేశంకూడా నిరాశాభావాన్ని ప్రకటించలేదు. ఉదయభాను డాశ్చర్యపోయాడు. దినమంతా పడిన శ్రమతో, ఆకలిదప్పికలతో, రక్తస్నాతదాహంతో, ఛిన్నవిచ్ఛిన్న రోధాంగహస్తంతో విజయవిశ్వాసంతో మునుకలిడుతూన్న తానా అతనియెదుట నిలబడ్డాడు. ఒక్కక్షణంలో రెండు పనులు— ఒకవంక తానా తన విశ్వాసఘాతుకమగు డాలును విసరిపారేశాడు; రెండోవంక ఆవేశంలో అతని హృదయం ఉత్సాహంగా ఉబికింది. ఉదయభానుడు తన జీవితంలో అటువంటి వీరుడిని యెప్పుడూ చూడలేదు.

నా ప్రతీఒక్కపాషాణం కుంచించుకుపోయింది. నా కన్నులలో భయం ప్రవేశించింది. మంచి కత్తీ డాలూ పట్టుకొని నూతన బలంతో వచ్చిన శత్రువు ఎట్టయెదుట కేవలం చేత ఖడ్గం పట్టి నిరాధారంగా నుంచోవడం— అబ్బా! సాహసి ఉదయభానుడుకూడా భయభీతుడై వెనక్కి తగ్గుతూన్నాడు. మఱి తానాకి భయమా? అసలు అతనికి ఆ పదమే తెలియదు. అనుకున్నట్టయితే, అతను ప్రాణరక్షణకు వెనక్కి పోగలడు. కాని రణక్షేత్రంలో వీపు చూపడం మొగలుచరిత్రలోని విశేషం. హిందూవీరుల జీవితంలో అది అసంభవం. వెనక్కి తగ్గితే శివాజీమహారాజుకి యేమని ముఖం చూపిస్తాడు? జిజామాతయెదుటికి యెలా వెడతాడు? నన్నింక యే ముఖం పెట్టుకు చూస్తాడు? అతని సాహసంపైన, అతని బలంపైన నమ్మకంతో గ్రుడ్డిగా ముందుకొచ్చి చిరస్థాయిగా పాతుకుపోయిన శత్రువృక్షాన్ని సమూలంగా పెల్లగించి నాశనం చేసే తన సైనికులకు యేమని ముఖం చూపగల్గుతాడు? నేను అతని రోమరోమాన్నీ చదివాను, "ఉదయభాను డయితే నేమిటి? హిమాలయమే విరిగిపడనియ్యి. సమస్తమొగలుశక్తి కేంద్రీ

(16 వ పేజీ చూడుడు)

నారసింహ లేహ్యము

బంగారు చేర్పబడినది. మేహము, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలము కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని, పెరిదేపి–నెల్లూరు జిల్లా

బ్రాంచి: 7 సీను మొదలివీధి, మద్రాసు.

# దైనందిన విద్యానిర్వహణంలో ప్రభుత్వస్థానం

(7-వ పేజీ తరువాయి)

పోషిస్తే, లేనివాడు శుశ్రూషచేసి ఆరాధిస్తే, లేనివానికి ఉన్నవాని ప్రక్కన విద్య నేర్చుకొనే యవకాశం ఉంటుంది. ధనికుని ధనం ప్రత్యక్షంగానూ, లేనివాని శారీరకష్టం పరోక్షంగానూ ఉపాధ్యాయుని ఆర్థికస్థితికి తోడుపడతాయి. ఈ సహాయం కూడా తాత్కాలికమే కాక, గురుశిష్యుల నడుమ నెలకొన్న ప్రేమజీవనం వారి యావజ్జీవం పరస్పరసహాయానికి పునాది అవుతుంది. గురువు తన వార్ధక్యంలో కూడా నిర్విచార సుఖజీవనం చేస్తాడు. "అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనం" అన్నమాట విద్యావంతుని యెడ సార్థకమౌతుంది. ఒక్క గురువుతో పోదు. ఒక్క శిష్యునితో పోదు. ఆ యిద్దరి కుటుంబాలకు వంశపరంపరగా యీ అనుబంధం పరమ పవిత్రమైన భక్తివిశ్వాసాలతో గట్టిపడుతుంది. విద్యాసంప్రదాయరక్షణ అవుతుంది. విద్యకు, విద్వాంసులకు ఇట్టి రక్షణ లభించటంకంటె దేశం యొక్క నాగరికానికి ఉత్తమనిదర్శనం ఇంకొకటి ఉండబోదు. కడిగి చేతులో పెట్టే నాలుగు రాళ్ళతో బడిపంతులును చంపడం వాని బ్రతుకు వానిని బ్రతుకనియ్యనందువల్ల, ప్రభుత్వానికి వాని ఆలుబిడ్డల ఉసురు తగులదు. అంతేగాక, తెలివైన విద్యార్థి అందిపుచ్చుకొన్నట్లు తక్కువ కాలంలోనే ఎక్కువవిజ్ఞానం పొందగలిగితే, వానికి వృధాకష్టయప్రయాసం తగ్గిపోవడానికి వీలుంటుంది.

## వైజ్ఞానికంగా

మరొక దృక్పథంతో పరిశీలిస్తాను. నేడు గురుసన్నిధికి శిష్యుడు పోడు. అందువల్ల సరి తప్పిపోతూంది. సరిలేక యెటువంటి గుణికి తెలియగబోదు గదా! పైగా డబ్బిచ్చి తెలివి కొంటాననే బాలుని కాళ్ళదగ్గర, పొట్ట చేతబట్టుకొని గురువు చదువు అమ్మడంవల్ల స్థూలంగా కనిపించే వికృతలక్షణాలకంటే, మనస్సుల్లో కలిగే విషఫలితాలు చెప్పాలంటే ఒక భారతం అవుతుంది. ఇలాటి చదువు చదువు కాదు. ఆతడు గురువు కాదు. వాడు శిష్యుడు కాడు. ఇది వట్టి దగాకోరు వర్తకం, లంచగొండి బేరం. పిల్లల క్రమశిక్షణ పోయిందని, పరీక్షపత్రాలు బయటపడ్డాయి అని, విద్య అంతస్తు (*Standard*) పతనమయిపోతోందని కారణం కనిపెట్టమని కమీషను మీద కమీషన్లు, కమిటీలమీద కమిటీలు వేసి ప్రభుత్వం చేసే ఆర్భాటం అంతా అక్కర్లేనివాళ్ళకు చదువు చెప్పించడంయొక్క విషపరిణామం. పొట్ట చేతబట్టుకొని యూరేగుచున్నట్లు గురువు విద్యార్థి మాపులో పడుటయే దీనికి కారణం. అదిగాక ఉపాధ్యాయుడు సరిగా పనిచేస్తున్నాడా లేదా యని దొంగను పట్టుకొన్నట్లు అభినయించే పరీక్షాధికారిశాఖవల్ల కూడా గురి చెడుచున్నది. ఇది ప్రభుత్వానికి మోయరాని పనికిమాలిన బరువు. వీరి జీతాలు, సిబ్బంది, బంట్రోతులు, వీరి ఊరేగింపులు (ట్రాన్సుఫర్లు) బేటాలువగయిరా కయ్యే దుబారా ఖర్చు తగ్గిపోవలసియున్నది. అదికాక ఒకకళలో ఒక శాస్త్రంలో పరమప్రమాణమైన గ్రంథం ఉండగా దానిలో కొంత దీనిలో కొంత యేర్చికూర్చి, యెంగిలి కూడు తిన్నట్లు కొనాకులు మేసినట్లు మూలం తెలియని విజ్ఞానం ప్రమాదకరం. కంచం మార్చి మట్టెలు, మట్టెలు మార్చి కంచం చేసినట్లు కుక్కగొడుగుల్లా యీ చెత్త పుస్తకాలు, గ్రంథకర్తలు, వారిని బుట్టలో పెట్టే పుస్తకాల వ్యాపారులు, వీరిని ప్రోత్సహించే పాఠ్యగ్రంథ నిర్ణయసంఘము (*Text Book Committi*) వ్యర్థమైన ఖర్చు. వీనివల్ల ప్రజల జ్ఞానమే కాక, ధనప్రాణాలు గుంజివేయడం, పిల్లల గుండెలార్చివేయడం జరుగుచున్నది. దీని కయ్యే కాగితం, అచ్చులు, అమ్మకాలు, లాభాలు, ఇదంతా వట్టిదండుగ, ప్రజల రక్తాన్ని పీల్చే ఘట్టం ఇది. ఇందులో భాషల రభస, చేతిపనుల గోలలు, ఇందులో సంగీతం. ఇందులో రేడియోలు. ఇందులో ఆటలు పాటలు అన్నీ తిని వెయ్యాలని దురాశ.

మరియొక ప్రధానఘట్టం. ఒకడు ధనికుడైన కారణంగా పోటీలో నెగ్గి చదివి పట్టపరీక్షలో నూటికి ముప్పది మార్కులెట్లో గడించిరాగా ఆమొద్దుదగ్గర, ఒక బుద్ధి కుశలుడైన బాలుడు రాజదండనకు జడిసి, ఒక నియమితకాలంలో, వాని అవకతవక చదువు నేర్చుకొంటూ, వాని యవినీతి నలవరచుకొంటూ పడియుండడంకంటె మూర్ఖుడై బ్రతుకుట ఉత్తమం కాదా! తండ్రిచదువు కొడుకుకూ, కొడుకుచదువు మనుమనికీ అందడంవల్ల అది సులభమవడమే కాక, సంప్రదాయశుద్ధి యేర్పడుతుంది. 'ఏకూటి చిలుక ఆపలుకు పలుకుతుంది' అన్నమాట కొంతైనా నిజమౌతుంది. ఇట్లా కాకపోతే విజ్ఞానానికి ఘోరమైన పతనం తప్పదు. ఇది వెంటనే వారింపబడకపోతే దేశం గాఢాంధకారంలో కూరుకుపోతుంది. తెలివివిలువ చచ్చిపోతుంది. దానితో రాజ్యతంత్రమే పడుకొంటుంది.

## నైతికంగా

ఇప్పుడు విద్యార్థుల గొంతిడినట్ల బడులలో ప్రవేశమే దుర్ఘటమయింది. నాకు నీ ఉద్యోగం వద్దు, జ్ఞానానికే చదువుకొంటాను. కావాలంటే వ్రాసియిస్తాను. నాకు ఇంజనీరింగు అంటే సరదా, వ్యవసాయమంటే ఉబలాటం. లేదా వైద్యం నేర్చుకొంటాను. ప్రాణదానం చేస్తాను. అని ఒక విద్యార్థి నిలువచీసి ప్రభుత్వాన్ని అడుగుతాడనుకోండి. కులాలవారీ మతాలవారీ విచక్షణచేసి, కాలేజీలలో, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం ఇచ్చే రాచరికం వానికేమి జవాబు చెప్పుతుంది. గవర్నరులు, మంత్రులు కలిగించుకొంటే విద్యాప్రవేశం, లేనివానికి గృహప్రవేశం అయితే యిది విద్యయేనా? ఆగర్భశ్రీమంతునికే అంది, ఆగర్భదరిద్రుని కందని విధానం పనికిరాదు. ఇట్టి కృత్రిమానికి ప్రభుత్వం పెత్తనంవహించడం గొప్ప తప్పు. 'ఎడ్యుకేషనల్ సెస్సు' అని ప్రతిబీదవాని కష్టంలోనూ రూపాయి కింత అని పన్ను పుచ్చుకొంటూ, వాని బిడ్డకు, డబ్బు పుచ్చుకొనే చదువుకు ప్రవేశం ఇవ్వననడం ఘోరాతిఘోరమైన రాక్షసం. ధనికుడై నూటికి ముప్పది మార్కులు వచ్చిన బుద్ధిదరిద్రునకు ప్రవేశం ఇచ్చి, నూటికి 90 మార్కులు వచ్చిన ధనదరిద్రుడైన ఒక బుద్ధిమంతునికి తలుపు మూసివేయడం అవినీతి. కాన కలిమిలేములకు విద్యార్హతకు సంబంధం ఉండకూడదు. అలా సంబంధం పెట్టినచో విద్యకు కేవలం రూపాయిలకొల విలువే కాని విజ్ఞానరీత్యా విలువ తీసివేసినట్లే, అప్పుడు కేవలం ఆర్థికమైన పోటీలో నెగ్గుకొనివచ్చిన పేరిగాళ్ళ ప్రభుత్వంవల్ల దేశం నైతికంగానే కాక, ఆర్థికంగాకూడా పెద్దదెబ్బ తింటుంది.

## రాజకీయంగా

'ప్రజాప్రభుత్వం ప్రజాప్రభుత్వం' అని కేవలం ఓట్లమీద ఆధారపడే ప్రజాప్రభుత్వం లాభంలేదు. పదిమంది ప్రజల ప్రేమను చూరలాడగలిగేది నిజమైన ప్రజాప్రభుత్వం. ప్రజలకు మేలుచేయడంచేతగాని నేను సింహాసనమెక్కి కూర్చుండడం తప్పని, ప్రజలవద్ద ఆరవవంతు పన్ను పుచ్చుకొనే నేను వారికి కూలివాడను గాని రాజసం చూపే రాజును గానని యయాతివంటి ప్రభువులు వాపోయినట్లు గాథ లున్నవి. కనుక రాజకీయంగాకూడా ఉత్తమవిజ్ఞానానికి సంస్కృతికి స్థానం లేకపోతే జాతి చచ్చిపోతుంది. దొంగా మనిషే అని, పదిమంది దొంగలెన్నుకొన్నవాడు పెద్దదొంగ అవుతాడుగాని ప్రజాప్రతినిధి కాజాలడు. అట్టి పెద్దదొంగలు పదిమంది కూర్చుని సంప్రదాయాలు, సదాచారాలు తారుమారుచేసే శాసనాలు తురతుర సృష్టిస్తే దేశం నైతికంగా పతనమయిపోతుంది. కావున నూటికి చాలావంతులు నిరక్షరాస్యమైన మనదేశంలో రాజ్యాంగం ప్రజాయత్తం చేసేముందు, ఉత్తమవిద్య సర్వులకు చేతనైతే ఉచితంగా చెప్పించు. అంతపనికి తట్టుకోలేకపోతే వైదొలగి ఉండు అంటున్నాను.

## శారీరకంగా

సూక్ష్మశరీరం మనస్సు. దాని వైద్యం ఒక్క భారతీయులకే తెలుసు. ఆ అనుపానులు బాగా ఎఱిగిన వివేకానందాదులు, ఆధ్యాత్మికంగా మన స్థాయి ఖండఖండాంతరాలకు చాటగలిగారు. అనాదిగా మన కేర్పడిన మార్గాలూ కట్టుబాట్లే వేరు. వీని పునాదులే వేరు. తెలివితో గుర్తిస్తే ఆ జాడలు మనకు గోచరిస్తూన్నాయి. అధికారం చే జిక్కినదిగదా అని కళ్ళు మూసుకొని, స్థూలమే కాని సూక్ష్మశరీరం అంటే ఏమో యెఱుగని భజగోవిందాలు పునాదులను తోచినట్లు అటూ ఇటూ కదలించి పారవేస్తాము' అని క్రొత్తక్రొత్త శాసనాలు క్రొత్తక్రొత్త దండనాలు సృష్టిస్తే అవి యీ జాతిని భక్షించివేస్తాయి. తొందరపడవద్దు ఉబలాటపడవద్దు అని హెచ్చరిస్తున్నాను.

సూక్ష్మదృష్టికలవారు, అనుపానులు తెలిసిన మహానుభావు లింకా దేశంలో ఉన్నారు. వారు సున్నం రాయిపెట్టి లక్షలుపెట్టి కట్టిన కట్టడాలలోనికిరారు. అడగనిదే చెప్పరు. నీ విచ్చే డబ్బుకు ఉబ్బరు. అట్టి వారి దివ్యదర్శనానికి మన మేపోవాలి. వారి పాదాలమీద వ్రాలాలి. అంటే అచ్చంగా ప్రాచీనగురుకులాలు అవతరించాలి. కాదంటే వాని ఛాయలైనా గోచరించాలి. చెదురు చెదురుగా ఉన్న శాంతినికేతనాలను భావనచేయండి. చాలు. నగరాలలో ఐశ్వర్యవంతుడు కారెక్కి తిరిగితే, వానివెనుక ఆ దుమ్మంతా పోసికొని క్షయవ్యాధికి ఎరయై, పందిరొచ్చులో పాకీదొడ్లలోదూరి, డబ్బుపెట్టి జబ్బులు కొనక్కొని, పుక్కబోధలకు చెవి యొగ్గి చావడం ఎందుకు? పల్లెటూళ్ళల్లో పవిత్ర నదీతీరాలలో, చెట్లనీడల్లో తీయనినీరూ, చల్లగాలి భక్షిస్తూ చల్లనివేళల్లో గురులబోధలు, బోధకంటె ఘనంగా వారి ప్రవర్తనలు అలవరచుకొని శారీరకంగా, మానసికంగా దిట్టపడే అవకాశం మనకు కావాలి. మేమేదో పన్నాగం పన్నుతున్నాం, మంత్రాంగం చేస్తున్నాం. రోజూ వేయికాయితాలమీద సంతకాలు పెడుతున్నాం. ఊరేగుతున్నాం అని మంత్రులంటే చాలదు.

## సమీక్షణ

అతిక్లిష్టమైన విద్యాసమస్యకు ఇది అతిసులభమైన పరిష్కారం. ఇందులో మేధానిధుల తలలు తిరిగిపోతున్నవి. ఏటేటా యంత్రాలవలె కట్టి కూలివాళ్లను తయారుచేస్తూన్న నేటి విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యలకు లయస్థానాలు కాక ఆలయాలు కావాలి. అందుకు గురుశిష్యుల నడుమ అనురాగం కుదరాలి. పరస్పరప్రేమరసం చూరలాడే విద్యకు ప్రకృతిసౌందర్యం కూడా తోడ్పడాలి. అట్టియెడ గురుశిష్యులనడుమ జరిగే ఉపదేశాలు వీర్యవత్తరములై, తేజస్వులై యన్యోన్యవృద్ధిహేతువులై దేశాన్ని సుభిక్షంచేస్తాయి. నాగరికవంతం చేస్తాయి. విద్యానిధు లా యానందం వల్లనే ఎక్కువ జీవిస్తారు. ఆదే ఉత్తమ జీవనం.

# కుమారగిరి-లకుమాదేవి

(10 వ-పేజీ తరువాయి)

తోపకుడు. నిత్యము పండితగోష్ఠులలో ప్రొద్దుపుచ్చువాడు. ఇతని కాలములో రాజ్యములో కళాలక్ష్మి తాండవమాడింది. పినతండ్రిఅన వేముడు రాజ్యమంతట వసంతోత్సవముల సల్పి వసంతరాయ కర్పూరవసంతరాయ బిరుదులు పొందాడు. కుమారగిరి ప్రతిసంవత్సరము మహావైభోగముగ వసంతోత్సవముల జరిపి కొమరగిరి వసంతనృపాలుడని పేరు గన్నాడు. ఈ వుత్సవములలో ఆంధ్రదేశమంతటనుంచి జనులు వచ్చి పాల్గొనువారు. దీనికి కావలసిన వస్తుసామగ్రి-ముత్యాలు, కస్తూరి, కుంకుమ, కర్పూరము, పునుగు, కాలాగురు, పన్నీరు- యిత్యాదులను పాండ్యాధిపసఖ, కావేరీవల్లభ బిరుదాంకితుడైన యవచి తిప్పయ దూరదేశములనుండి సరఫరా చేయువాడు; కామోత్సవమురోజులలో కొండపీటిలో సుగంధభాండారాధ్యక్షుడుగ నుండువాడు. రాజతనికి ఛత్రి, చామర, తురంగ, భద్రపీఠ, కలాచిక, పల్యాణాదుల నిచ్చి గౌరవించాడు. వసంతోత్సవములలో కుమారగిరి లకుమాదేవితో విహరించువాడు. లకుమ తన నృత్యముతో నందరను ముగ్ధుల జేయుచుండెను. శ్రీనాథుడీ యుత్సవముల జూడవచ్చుచుండువాడు. కుమారగిరి యనేకజలక్రీడాగారముల గట్టించి వానిలో వసంతోత్సవపు దినములలో తన రాణివాసముతో క్రీడించువాడు. ఈ వుత్సవ ముఖ్యభాగము కామపురాజ. కర్పూరమును దశదిశల నదజల్లుదురు. స్త్రీపురుషులు నీటి గొట్టములతో రంగునీరు నొండొరులపై జిమ్ముకొని యానందింతురు. కొమారగిరి యనేకభవనములు క్రీడార్థమై నిర్మించాడు. గృహరాజ సౌధము రెడ్డిరాజభవనమే. కొమరగిరికాలములో నిది యున్నట్లు కాటయవేముని కొమరగిరివరము శాసనమువల్ల తెలియనగును. మహారాజా కడుం గూర్చుప్రియురాలైన లకుమ తన ప్రభువుతో నిందు విహరించియుండవచ్చును. గృహరాజ దిబ్బ యిప్పటికి కొండవీటిలో గలదు. ఈకాలపు రెడ్డి రాజ్య వసంతోత్సవ వైభవమును, విద్యానగరాధీశుడు రెండవ హరిహరరాయలు, బహమనీ సుల్తాను ఫిరోజ్ షా, గజపతి నాల్గవ వీరనరసింహరాయలు మెచ్చుకొన్నారు.

కుమారుడు వీరాన్నవోతని యంకతలమున నిడికొని, కుమారగిరి దాక్షారామభీమేశ్వరుని సముఖమున తులాపురుషదానములు జేసెను. భరతుడు, భోజుడు రచించిన గ్రంథముల జతిని సంస్కృతములో వసంతరాజీయమను నాట్యశాస్త్రము విరచించాడు వసంతరాజు. దీనినిబట్టి యితనికి నృత్త, గీత, నాటకకళలందు గల యభిరుచి ప్రవేశము తెలియుచున్నది. లకుమాదేవి సహస్రనవాభినయముల వీక్షించి, కుమారగిరి నాట్యగ్రంథరచనకు బూనుకొనెనేమో! ఈ గ్రంథములో నిర్ణీతమార్గశిక్షణపద్ధతుల లో కాటయవేముడు కాళిదాసునాటకత్రయమునకు వ్యాఖ్య - కుమారగిరిరాజీయమను పేర రచించి అచటచట వసంతరాజీయములోని ప్రమాణవాక్యముల జొప్పించెను.

కొమరగిరివసంతనృపాలునితో మహాసంపదతో తులతూగిన లకుమ యతని యనంతరమున్నట్లు తోపదు. కాముకు లిరువురు నొకసాతే యనంతకాలగర్భమున లీనమైరేమో!

[మద్రాసు రేడియోవారి సౌజన్యంతో.]





ఉబ్బసపు రోగము నకు

శాస్త్రయుక్తమైన చికిత్స

ఉబ్బసపురోగము చిటికలతోనూ మంత్రములతోనూతదితర విధములైన ఔషధములతోనూ అప్పటికప్పుడు తగ్గినట్లు కనిపించినా ఈ మందులవలన అది దీర్ఘరోగముగామారుట తప్ప ఏమియు లాభము లేదు.

పురోహిత శ్వాసహరి అనేక సంవత్సరములుగా వైద్య శాస్త్రమునకు తెలిసినదే ఉబ్బసమునకు సరియైన శాస్త్రయుక్తమైన మందు యిదే అని అందరికీ తెలిసినదే. చక్కగా జీర్ణం అవుతుంది. క్రమక్రమంగా ఆరోగ్యం చేకూరుతుంది. ఊపిరితిత్తులు బలపడుతవి. ఉబ్బసం శాశ్వతంగ నివారణ మగును. మంచి కెమిస్టు లందరివద్ద 3. డా 6. డా, 12. డా. ల సీసాలలో రు. 3/8. రు. 6/- 10/- లకు దొరకును. లేదా డాక్టర్ పురోహిత్ ఫార్మసీ కొల్హాపూర్, యస్. యమ్. సి. గారికి వ్రాయుడు.



పురోహిత శ్వాసహరి

మద్రాసు స్టాకిస్టులు: అప్పా అండ్ కో. చైనా బజారు (2) జె. బాలాభాయ్ అండ్ కో, 260 చైనా బజారురోడు, (3) దాదా అండ్ కంపెనీ, నైనియప్ప నాయకన్ వీధి; రాజమండ్రి, ఈశ్వర్‌దాస్ అండ్ కో. బెజవాడ. బెజవాడ మెడికల్ స్టోర్సు; విశాఖపట్నం; వైజాగ్ మెడికల్ స్టోర్సు; సికింద్రాబాద్, వందలీ అండ్ కో. సుబ్రిక్‌వీధి; నెల్లూరు, వి. ఆర్. గోపాల్ బ్రదర్సు, ట్రంకురోడు; ఒంగోలు, ధన్వంతరి మెడికల్ స్టోర్సు, గుంటూరు, మెడికల్ అండ్ ఆప్టికల్ ఎంపోరియం; గుడివాడ, గుడివాడ మెడికల్ స్టోర్సు; ఏలూరు, రావు మెడికల్ స్టోర్సు; కాకినాడ, లక్ష్మీనారాయణ అండ్ కో; మచిలీపట్నం, మెడికల్ స్టోర్సు.